# నిస్వార్థసేవయే కర్మయోగమునకు కీలకము

**కోమలత్వంబు నిస్వార్థ గుణము కల్గి**
**సేవ చేయుట నిజమైన సేవయగును**
**స్నేహభావంబుతోగూడి సేవ చేయ**
**శాంతి ధామంబు చేరుట సత్యమయ్య**

దివ్యాత్మ స్వరూపులారా!

జీవితము నిస్వార్థ సేవలకై నియమింపబడినదే కాని, స్వార్థమునకు కాదనే సత్యాన్ని మనం అర్థము చేసుకొవాలి. నిస్వార్థసేవలవలన మానవాళి యేకత్వాన్ని గుర్తించటానికి వీలవుతుంది. నిస్వార్థసేవ కర్మయోగమునకు కీలకము. మనస్సుకు, దేహమునకు నిస్వార్థ సేవతో శిక్షణ అందించటమే యోగమునకు మూలాధారము. సమాజమునందు నిస్వార్థ సేవ సల్పు వ్యక్తులనే సమాజము గౌరవిస్తుంది. సమాజ గౌరవాన్ని అందుకున్న మానవుడు దైవప్రేమకు పాత్రుడౌతాడు. నిస్వార్థ సేవ మానవునకు అత్యవసరమనే సత్యాన్ని ప్రతి వ్యక్తికూడను గుర్తించవలసివస్తుంది. నిస్వార్థసేవతోబాటు త్యాగభావముకూడను అతను పూని వుండాలి. ఇట్టి త్యాగ భావముతోకూడిన ప్రేమతత్త్వమునందు స్వార్థము దూరము చేసి పరార్థమైన భావముతో ఆచరించటమే నిజమైన నిస్వార్థ సేవగా రూపొందుతుంది. జీవితమునకు నిస్వార్థ సేవ, రుచిని చేకూర్చు లవణము వంటిది. విశ్వప్రేమ జీవితమునకు పుష్టిని అందించే ఆహారమువంటిది. ప్రేమయే మానవునకు జీవితములో ప్రాణము. దాతృత్వమే జీవితమునకు సరైన సుగంధము. కనుక, యీ దాతృత్వభావమును ప్రతి మానవుడు తన హృదయమునందు నింపుకొని తద్వారా సేవయందు ప్రవేశించటము అత్యవసరము. మానవుడు యెంతటి వాడైనప్పటికిని, నిస్వార్థ సేవకై యేర్పడినదే యీజీవితమని గుర్తించాలి. తల్లీబిడ్డలుగాని, గురుశిష్యులుగాని, దైవము భక్తుడుగాని

srisathyasaivachanamrutam

ఒకరిని ఒకరు ఆశ్రయించే వుంటున్నారు. తల్లియేలేకున్న బిడ్డ అనే పదమునకు అర్థమే లేదు. బిడ్డ లేకుండిన తల్లి అనే పదమునకు అర్థమేలేదు. అదే విధముగనే దైవమే లేకుండిన దాసుడే లేడు. దాసుడే లేకుండిన దైవమే లేడు. ఈ రెండు పదములుకూడ ఒకదానికొకటి అన్యోన్యతతో కొంతవరకును సమన్వయము గావించుకొని ఒకదానికొకటి అన్యోన్యాశ్రయమై వుంటున్నాది. ఈ అవినాభావసంబంధమైన తత్త్వాన్ని అందరూ గుర్తించాలి.

## సమాజమునుండి దూరము గావింపబడిన దరిద్రనారాయణులకు సేవ చేయటము అత్యవసరం

మనము యితరులతో సేవ చేయించుకొనుటకంటె, యితరులకు సేవ చేసే వ్యక్తులుగా రూపొందాలి. ఇంతేకాక, మనకంటె అధిక స్థాయిలో వుండినవారికి సేవ చేయటము అంత గొప్ప కాదు. కారణమేమనగా వారికి అనేకమంది సేవకులుండవచ్చు. మనతో సమానమైన శక్తి కల్గినవారికి సేవ చేయటము కూడను అంత గొప్పకాదు. మనకంటె తక్కువ స్థాయియందు వుండి లోకముచే నిర్లక్ష్యము గావించబడిన వ్యక్తులకు మనము సేవ చెయ్యాలి. మానవులయొక్క తెగలు మనము విచారణ చేసి విభజించినప్పుడు ఉన్నత స్థాయియందు వున్నటువంటివాడు తాను లక్ష్మీనారాయణ స్థాయి అని చెప్పవచ్చును. మనతో నమాన స్థాయియందున్నవాడు అశ్వత్థ నారాయణుడని చెప్పవచ్చును. మనకంటె తక్కువ స్థాయియందుండిన వానిని కేవలం దరిద్రనారాయణుడని చెప్పవచ్చును. లక్ష్మినారాయణునికి మనము సేవ చేయనక్కరలేదు. అతనికి కావలసినంతమంది సేవకులుంటారు. అశ్వత్థనారాయణుడంటే నిరంతరము కోరికలవెంట పరుగెత్తేవాడు. ఎన్ని విధములైన శక్తిసామర్థ్యములుండినప్పటికి అతనికి యేమాత్రం తృప్తి అనేది వుండదు. ఎంత సంపాదన చేసినప్పటికి యింకనూ సంపాదించాలనే దురాశతో అతను కుమిలిపోతుంటాడు. అలాంటివారికి సేవ చేయవలసిన అవసరమే లేదు. కాని దీనులై, ప్రతియొక్క దానిలోకూడను సమాజమునకు దూరము గావింపబడిన దీనజనులకు సేవ చేయటము అత్యవసరము. ఆ స్థితియందుకూడను యెవరికో మనము సేవ చేస్తున్నామన్న

srisathyasaivachanamrutam

భావన తలంచరాదు. ఈ లోకములో వుండిన నారాయణునికి నేను సేవ చేస్తున్నాను అనే ప్రేమ భావముతో మనము హృదయపూర్వకముగా సేవ చేయాలి.

**కార్యకర్తలే సంస్థకు వెన్నెముకవంటివారు**

త్రికరణశుద్ధిగా సేవలు గావించినవారికే మనసు పరిశుద్ధమవుతుంది. మానసిక పరిశుద్ధము లేక మానవుడేమాత్రము వున్నత స్థాయిని చెందలేడు. కార్యకర్తలయందు అహంకారముగాని, ఆడంబరముకాని యేమాత్రము వుండరాదు. కార్యకర్తలు విశాలమైన హృదయము కల్గి వుండాలి. నిస్వార్థమైన భావము వుంటుండాలి. ప్రేమ హృదయమున పెంచుకోవాలి. కార్యకర్తలే సంస్థకు వెన్నెముకవంటివారు. అలాంటివారు మౌలికమైన మానవత్వాన్ని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోటం మాత్రమే చాలదు. ఆచరించాలి. ఇట్టి ఆచరణ లేక ఆడంబర అహంకారములతో చేసే సేవలు సేవలనిపించుకోవు. జీవితములో మనము అనుభవించే సుఖ, దుఃఖములు, రాగద్వేషములు, విషయవాసనలు యివన్నీ మానసిక వికారములే! ఇది వేరు, నేను వేరు అనే ద్వైత భావమే యీ వికారమునకు మూలకారణము. ఎవరేమైనను ఫరవాలేదు నేను, నావారు మాత్రమే క్షేమంగా, ఆనందంగా వుంటుండాలి అనే స్వార్థభావమే ద్వైతమునకు మూలకారణము.

**నూరుమంది తెలివిగలవారలకంటె సహృదయము కలిగిన ఒక్క వ్యక్తి చాలు**

ఇట్టి ద్వైతభావముచేతనే మానవునియందు రాగద్వేషములు అభివృద్ధి గాంచుచున్నవి. ఈ రాగద్వేషములే మనసును మాలిన్యం గావించుచున్నవి. కనుక తరతరములనుండి మాలిన్యముతో కరడుగట్టిన యీ మనసును పరిశుద్ధము చేయవలెనన్న అంత సులభముగా అయ్యేది కాదు. ఇది కేవలం సేవల ద్వారానే పరిశుద్ధమవుతుంది. తైలపు గిన్నెలో కనిపిస్తున్న చంద్ర ప్రతిబింబాన్ని మనము వేరు గావించాలనుకున్నప్పుడు దీనికి సరైన మార్గాన్ని అనుసరించాలి. యీనాటి మానవుడు తైలపు గిన్నెలో వున్న చంద్రబింబాన్ని దూరము చేయాలనే సంకల్పముచేత ఆ పాత్రను నిప్పులో పెట్టి కాలుస్తున్నాడు. ఈ ప్రతిబింబమునకు తైలమే కారణముగాని గిన్నెకాదు. తైలమును తీసివేసినప్పుడే యీ

sri sathyasai vahini vachanamrutam

ప్రతిబింబము దూరమౌతుంది. అట్లుకాక పాత్ర అయిన దేహాన్ని మనము శిక్షించటానికి ప్రయత్నించినప్పుడు యీ ప్రతిబింబమనే మాలిన్యము మనకేనాటికి దూరము కాదు.

**పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా**
**తనువును తాదండించిన విషయ భోగములుడుగునా**
**అకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞానియగునా**
**తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞాన మెరుగునా.**

ఈనాడు దినమునకు పది పర్యాయములు స్నానముగావించి, శుచియైన వస్త్రము ధరించి దేవుని తలంచి యాంత్రికముగా మనం మంత్రం ఉచ్చరించినంత మాత్రమున మనలోనున్న మాలిన్యము యేమాత్రము దూరంకాదు. కానీ, యీనాడు యీ విధమైన అభ్యాసములుమాత్రమే మనము గావిస్తున్నాము. స్నానము చేయుటము, విభూతిని ధరించటము, మంత్రములు ఉచ్చరించటము యివన్నీ కేవలము ఆడంబరములైన మార్గములేగాని ఆత్మకు సంబంధించినవి కావు. ఇవి మానసిక పరిశుద్ధతకు యేమాత్రంకూడను దోహదం చేయవు. విచారణచేత, నిస్వార్థభావముచేత మనము సమాజసేవలో పాల్గొనాలి. ఏ విజ్ఞానము మానవుని పశుత్వమునుండి వేరుచేసి దీనిని అధికంగావించినదో, ఆ విజ్ఞానాన్ని యీనాడు మనం మరచిపోతున్నాము. ఆ విజ్ఞానతత్త్వాన్ని మనం విచారించటానికి ప్రయత్నము చేయటంలేదు. సత్యమును అసత్యముగను, అసత్యమును సత్యముగను భావించి తాను, తన సంపద, తన కుటుంబము శాశ్వతమని భావిస్తున్నాడు, మానవుడు. ఈ సంకుచితమైన స్థాయినుండి విశాలమైన మార్గమునకు మనము ప్రయాణము చెయ్యాలి. యావత్ మానవులందరుకూడను ఒకే ఈశ్వర కుటుంబమునకు చెందినవారని మనము విశ్వసించాలి. స్వార్థమును త్యాగము చెయ్యాలి. అప్పుడే ఆ విశాలభావములను అందుకొనుటకు అర్హులమౌతాము. అట్లుకాక మనము యేదో లౌకికముగా, యాంత్రికముగా సాధనలు సల్పినంతమాత్రమున భక్తులము కాలేము. వేదశాస్త్రయితిహాస పురాణములను పఠింపవచ్చును. గొప్ప తెలివితేటలు కలవారుగా రూపొందించవచ్చును.

sri sathyasaivachanamrutam

ఈ తెలివితేటలుకాదు, సాధనలకు కావలసినవి. నూరుమంది తెలితేటలు గల్గినవారికంటె మంచి హృదయముగల్గిన ఒక్క వ్యక్తి వుంటే చాలు. కనుక, మనము మంచి మనసు కలిగిన మానవులుగా తయారుకావాలి. ఈ మంచి మనసు కలిగినప్పుడే మంచి పనులలో మనము ప్రవేశిస్తాము. మనసునిండుకు సంకుచితమైన భావాలు, అసూయ భావాలు క్రోధరాగములతోకూడిన భావాలను నింపుకొని యీ సేవలయందు ప్రవేశించినంతమాత్రమున సేవకులము కానేరము.

**ఏమిలేని బుఱ్ఱలోన యేమైనను చేర్చవచ్చు**
**ఏమేమో నిండియున్న బుఱ్ఱ నింప వీలుకాదు**
**కలి బోధలు నిండియున్న తలబుఱ్ఱది ఖాళియగున**
**తలబుఱ్ఱది ఖాళికాక యిల సుకృతంబు నింపనగునా!**

కనుక మనలో వుండిన దుర్భావములు, దుర్గుణములు, దురాలోచనలు, స్వార్థము, అహంకారమనేవి మొట్టమొదట తీసివెయ్యాలి. అప్పుడే మన ప్రేమభావము అందులో ఆవిర్భవిస్తుంది.

**సేవ చేయని మానవుడు మానవుడే కాదు**

ప్రేమ కల్గిన హృదయమే నిజమైన పవిత్ర హృదయము. కనుక, ప్రేమభావముతో మనము సేవలో ప్రవేశించాలి. పేరు, ప్రతిష్ఠలకోసము మనము ప్రాకులాడరాదు. కీర్తి అనేది కొనుక్కుంటే లభించేది కాదు. ఒకరినుండి పుచ్చుకొనే పదార్థము కాదిది. ఈ కీర్తి ఒక ప్రవాహమువంటిది. అది చాలా చిన్నదిగా పుట్టవచ్చును. కర్తవ్యమును నిర్వర్తించుకొనే చిత్తమును మనము అభివృద్ధి పరుచుకోవాలి. కానీ అలాంటి చిత్తము ఒక్క సేవలద్వారానే మనకు లభిస్తుంది. సేవ చేయని మానవుడు, మానవుడే కాదు! సేవకై జన్మించిన మానవుడుగా మనము విశ్వసించాలి. ఇలాంటి పవిత్రమైన మానవత్వమును మనము సార్థకముగావించుకొనవలెనన్న మనము సమాజ సేవలో పాల్గొనాలి. యేకించిత్ సేవ

srisathyasai vachanamrutam

చేసినప్పటికిని, మనము అనేక విధములైన గొప్పను అందుకోటానికి అర్హులమవుతాము. సేవ చిన్నదిగా వుండవచ్చును. కాని, హృదయాన్ని గొప్పదిగా మనము మార్చుకోవాలి. ఆవుకు పనికిమాలిన గడ్డి వేసినప్పటికి పవిత్రమైన క్షీరాన్ని అందిస్తుంది. అదే విధముగనే నీ సేవ చాలా చిన్నదైనప్పటికిని, యెలాంటివారికి చేసినప్పటికిని, అది పవిత్ర హృదయముతో చేస్తే గొప్ప ఫలితమునిస్తుంది. ఫలితమును లక్ష్యమునందుంచుకొని మనము సేవ చెయ్యరాదు. 'ఇది నా కర్తవ్యము, సేవ నిమిత్తమై నేను జన్మించినవాడను', అనే విశ్వాసము మనము అభివృద్ధిగావించుకోవాలి. జగత్తులోవుండిన ప్రతి ప్రాణి ఒకరికొకరు సేవ చేసుకునేవారేగాని, ఒకరికంటే ఒకరు అధికులెవ్వరు లేరు. ఏఏస్థాయికి సంబంధించిన వ్యక్తులు ఆయాస్థాయిలో ఆయా సేవలు ఆచరించాలి. దేహములో వివిధ అంగములుంటున్నాయి. కానీ, చేతులు చేసే పనులు చెవులు చేయలేవు. చెవులు అనుభవించే ఫలితము కన్నులు అనుభవించలేవు. అదే విధముగనే వ్యక్తులు అనేక విధములుగా వుండవచ్చు. వారిలో శక్తిసామర్థ్యములు భిన్న భిన్నముగా వుండవచ్చు. కాని, యెవరి శక్తికి తగ్గట్టుగా, యెవరి హృదయానికి తగినట్టుగా, యెవరి స్థాయికి తగినట్టుగా వారు సేవలయందు పాల్గొనాలి. జపములు, ధ్యానములు, పూజలు, వ్రతములువంటి కర్మలను ఎవరి అభీష్టానుసారము వారు ఆచరించవచ్చు. జపతపములు, యాగములు, యజ్ఞములు చేసేదానికంటె. సేవలవలన కలిగే ఫలితము అధికమైనది.

**నతపాంసి నతీర్థానాం నశాస్త్రానాం నజపానపి**
**సంసారసాగరోత్తారం సజ్జన సేవనం వినా**

మనం యెన్ని యాత్రలు చేసినప్పటికి మన భావములు కేవలము లౌకికాన్ని మాత్రమే ఆకర్షిస్తుంటాయి. హృదయ సంబంధమైన పవిత్రతను గుర్తించటానికి యేమాత్రముకూడను ప్రయత్నించటం లేదు.

**రాగద్వేషములే మానవుని దుఃఖమునకు మూలకారణము**

వ్యక్తి, ముక్తి కోరుట స్వార్థమగును. తాను మాత్రమే తరింపగోరుట ధర్మము కాదు. పరులనుకూడ తరింపచేయటానికి ప్రయత్నము చెయ్యాలి. అదే నిజమైన సేవ. మనము

ఆ విధమైన విశాలభావాన్ని యీనాటికిని అందుకో లేకపోతున్నాము. ఎంత కాలమైనప్పటికి స్వార్థము, స్వప్రయోజనము; స్వార్థము, స్వప్రయోజనము. ఇట్టి స్థితియందే వున్నప్పుడు భగవత్ కృపగాని, భగవత్ తత్త్వముగాని యేవిధముగా అర్థము చేసుకోగలము? కనుక, మానవత్వములో పవిత్రమైన దివ్యత్వము కలదనే సత్యాన్ని మొట్టమొదట మనము విశ్వసించాలి. ప్రపంచమంతయుకూడను తనయొక్క తత్త్వమే అనే సత్యము గుర్తించాలి, విశ్వసించాలి. అనేకత్వములోని యేకత్వాన్ని మనము అర్థము చేసుకోవాలి. అప్పుడే మానవుడు దైవత్వాన్ని కొంతవరకునైనా అర్థము చేసుకొనగలడు. మూర్ఖత్వముతో స్వార్థమును అనుభవించుకుంటూ కూర్చున్నంతకాలము మానవత్వము మనకు అర్థము కాదు. కనుక, స్వార్థమును మనము త్యాగము చెయ్యాలి. ఈ స్వార్థము వుండినంతవరకు ద్వైతము తప్పినది కాదు. ద్వైత భావము వుండినంతవరకు రాగద్వేషములను మనము దూరము చేసుకొనలేము. రాగద్వేషములే మానవుని దుఃఖమునకు మూలకారణము. అహంకారము వుండిన మానవుని సమాజము గౌరవించదు. క్రోధము కలిగినవాడు దుఃఖమునుండి వేరు కాలేడు. లోభము వుండినంతవరకు తనయొక్క విశాలత్వమును తాను గుర్తించలేడు. అహంకార, రాగద్వేషములువుండినంతవరకు తనయొక్క విశాలత్వము తాను గుర్తించలేడు. తనను తాను అర్థము చేసుకొన్నవాడే పరులను అర్థము చేసుకొనుటకు శక్తిమంతుడౌతాడు. మొట్టమొదట తన తత్త్వాన్ని తాను గుర్తించాలి. ప్రతివిషయమునందుకూడను 'నేను, నేను'. యీ 'నేను' అనేటువంటిది యెక్కడ వుంది? ఇది పుట్టటానికి యేదో ఒక స్థానము వుండాలి కదా! ఈ నేను యెక్కడనుండి ఆవిర్భవిస్తున్నాది? లౌకిక జగత్తులో చూచినప్పుడు యీ 'నేను, నేను' అనేది శారీరకదృష్టితో అనుభవిస్తున్నాము. ఈ 'నేను, నేను' అనే అహంభావమును శృతులు 'హృదయము' అని పిలుస్తూవచ్చాయి. అట్టి యీ హృదయము దేహములో యెక్కడో ఒక భాగముగా వుండాలి. కాని, మనము సరిగా విచారించినప్పుడు యిది ఒక భాగముగా వుండేది కాదు. విశ్వమంతా వ్యాపించినదే హృదయము! ఈ హృదయమునకే 'ఆత్మ' అని పేరు. ఈ ఆత్మ హృదయములో వున్నదని కొంతమంది చెపుతూంటారు. ఇదికూడను చాలా పొరపాటు. 'హృదయమే ఆత్మ, ఆత్మయే హృదయము'.

sri sathyasai vahini

అందువలన, హృదయములో ఆత్మ వున్నదని భావించటము అజ్ఞానము.

**మన దృష్టిని ఆత్మవైపు మళ్ళించినపుడు మనసు సహజముగనే మాయమవుతుంది**

అయితే మనము యీ విధమైన అంధకారములో మునిగి అజ్ఞానముతో పరితపిస్తున్నామంటే దీనికి మూలకారణమేమిటి? మన దృష్టి ఆత్మవైపు ప్రయాణం చేయటం లేదు. కేవలము మనసువరకే యిది ప్రయాణము సలుపుతున్నది. మనసుపైనే ఆధారపడినవాడు యీ అజ్ఞానమనే అంధకారములో పడకతప్పదు. అయితే యీ మనసును అరికట్టే విధానమేమిటి? మనసును అరికట్టనవసరములేదు. మనసును అరికట్టుటకు యెవరికిని సాధ్యము కాదు. అయితే యీ మనసును యేవిధముగా స్వాధీనము చేసుకోవాలి? దీనికి ఒక్కటే ఒక్క ఉపాయము. సూర్యుడు వుండినంతవరకుకూడను చంద్రుని మనము లక్ష్యము చేయము. చంద్రుడుకూడను ప్రకాశించలేడు. చంద్రునియొక్క ప్రకాశమంతయు సూర్యునిపైననే ఆధారపడివుంటున్నాది. ఎప్పుడు సూర్యుడు లేకుండునో అప్పుడే చంద్రుని మనము అశిస్తాము. ఆత్మయే సూర్యుడు, మనసే చంద్రుడు. ఆత్మదృష్టి లేనంతవరకు మనస్సుపైనే ఆధారపడివుంటాము, మనము. అయితే, యీ చంద్రుడనే మనసుకూడను ఆత్మ అనే సూర్యునిపైన ఆధారపడివున్నదనే సత్యమును మనము గుర్తించుకోవాలి. మనయొక్క దృష్టిని ఆత్మవైపుకు మరల్చినప్పుడు మనసు సహజముగనే మాయమవుతుంది. అది వుండినాకూడను అదృశ్యమైపోతుంది. కనుపించదు. సూర్యుడు ప్రకాశించే సమయములో చంద్రుడు కనుపించవచ్చు; కానీ, అతను అప్రకాశకుడే! అదే విధముగ మనము జీవితమంతా మనసునే ఆశ్రయించి, మనసునే ఆధారము చేసుకొని జీవించటానికి ప్రయత్నించినంతకాలము మనకు దుఃఖములు, రాగద్వేషములు దూరము చేసుకొనుటకు యేమాత్రము వీలుకాదు. కనుక సర్వత్రా వుండినటువంటి ఆత్మతత్త్వాన్ని హృదయముగా భావించే విశాలమైన భావాన్ని మనము పెంచుకోటానికి ప్రయత్నించాలి.

**ప్రేమ స్వరూపుడైన పరమాత్ముని పొందాలంటే మనలో ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి**

'విశ్వం విష్ణుస్వరూపం'. భగవంతుడు యెక్కడో ఒక చోట వుంటున్నాడు అని కాదు,

sri sathyasai vahini

మనకు.

**దేవుడెక్కడనుచు దేవులాడగనేల**
**హృదయరూపుడు కాదె ఈశ్వరుండు**
**యిచ్చుకొనుము సేవ పుచ్చుకొనుము ప్రేమ.**

అక్కడే దైవత్వము మనకు సాక్షాత్కరిస్తుంది. కానీ, యీనాడు హృదయపూర్వకంగా సేవను యిచ్చుకోటంలేదు, ప్రేమను పుచ్చుకొవటంలేదు. సేవనిచ్చే శక్తి వీనికిగాని, ప్రేమనిచ్చే శక్తి అతనికిగాని లేని స్థితిలో వుంటున్నారు. ఈ ప్రేమకూడను స్వప్రయోజనము, స్వార్థమువైపునకే ప్రయాణమవుతున్నదిగాని విశాలమైన పదార్థమువరకు ప్రయాణము చేయటంలేదు. మన ప్రేమ కేవలం మనకుటుంబమునకు మాత్రమే పరిమితం కారాదు. దీనిని దాటి సంఘమువరకు ప్రయాణము చెయ్యాలి. విశాలమైన ప్రపంచములో ప్రవేశించాలి. ఇదియే బుద్ధుడుకూడను చెప్పింది.

**బుద్ధం శరణం గచ్ఛామి**
**సంఘం శరణం గచ్ఛామి**

మనం బుద్ధిని మాత్రమే ఉపయోగపెడుతున్నాము. బుద్ధికి మాత్రమే మనము శరణాగతులమవుతున్నాము. బుద్ధిని మాత్రమే ఆశ్రయిస్తున్నాము. బుద్ధిని అంతవరకే పరిమితం గావించకుండా 'సంఘం శరణం గచ్ఛామి', అని సంఘములో ప్రవేశపెట్టాలి. అప్పుడే మానవుడు విశాలమైన హృదయాన్ని కలిగి యేకత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నిస్తాడు. ఆకారములు భిన్నంగా వుంటున్నవి, రూపనామములు భిన్నంగా వుంటున్నవి, కాని దివ్యత్వమైన హృదయము ఒక్కటే అనే స్థాయికి కొంతవరకు మనం ప్రయాణం చెయ్యాలి. సంఘములో మెంబర్ అయినంతమాత్రమున యేమీ ప్రయోజనము లేదు. 'నేను ఫలానా కమిటీలో మెంబరును', అని మనం చెప్పుకుంటూంటాము. మెంబరు అయినంతమాత్రమున యేమి ప్రయోజనము? కనుకనే, 'బుద్ధం శరణం గచ్ఛామి', 'సంఘం శరణం గచ్ఛామి', అని చెప్పడం. సంఘములో ప్రవేశించాలి. అయితే, సంఘములో ప్రవేశించి యేవిధమైన సేవలు చేయకుండా వుండిన అట్టివారు చచ్చినవారితో

సమానము. అక్కడనుండి 'ధర్మం శరణం గచ్ఛామి', అనే స్థాయికి ప్రయాణం చెయ్యాలి. సంఘములో ధర్మాన్ని మనము ఆశ్రయించాలి, ఆచరించాలి. పవిత్రమైన, నిజమైన సేవలయందు మనం ప్రవేశించినప్పుడు అదే నిజమైన ధర్మము. 'సేవ చేసే నిమిత్తము నేను పుట్టాను కాని, సేవ చేయించుకొనే నిమిత్తముకాదు', అనే సత్యాన్ని మనం యిక్కడ అర్థం చేసుకోవచ్చు. నిజముగా భగవంతునికి ప్రీతికరమైన పాత్ర హృదయమే! ఆ హృదయమే తన స్వరూపము. తనను పొందవలసినవాడు తన ఆకారాన్ని పొందాలి. ప్రకాశించే సూర్యుని చూడాలంటే యే హరికెన్ లాంతరో, పెట్రొమాక్సులైటో, టార్చిలైటో మనకు అక్కరలేదు. సూర్యునియొక్క ప్రకాశంచేతనే సూర్యుని చూడాలి. భగవంతుడు ప్రేమ స్వరూపుడు. అట్టి ప్రేమస్వరూపుడైన పరమాత్ముని మనం పొందాలంటే మనలో ప్రేమను అభివృద్ధిగావించుకోవాలి. భగవంతుడు సత్య స్వరూపుడు. అట్టి సత్యాన్ని మనం గుర్తించాలంటే మనము అసత్యములాడితే ప్రయోజనము లేదు. మనముకూడను సత్యస్వరూపులము కావాలి. భగవంతుడు శాంతమయుడు. అట్టి శాంతాన్ని మనం పొందాలంటే మనము శాంతాన్ని అనుభవించాలి. అప్పుడే యిది 'బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి'. దానిని గుర్తించినవాడు అదిగానే మారిపోతాడు.

**మానవులందరూ ఒక్కటే; అందరూ దైవాంశములే!**

మానవుడు మానవునిగా బ్రతకాలంటే, మానవుని ప్రేమించాలి. ఇక్కడ రెండు విషయాలు మనం గుర్తుంచుకోవాలి. 'నేను మనిషి, నేను మనిషి' అని చెప్పకోటము యిది సంపూర్ణ సత్యము కాదు. ఇది అర్థసత్యము మాత్రమే. 'నేను మానవుడను' అనేది అర్థసత్యము. 'నేను పశువును కాదు' అనేది, వేరొక అర్థసత్యము. 'నేను మానవుడు, పశువును కాదు', అని యీ రెండిటిని చేర్చినప్పుడు పూర్ణ మానవుడవుతాడు. నేను మానవుడననుకుంటూ పశువులా ప్రవర్తిస్తూంటే మానవుటెట్లవుతాడు? పశువు స్వార్థముతో కూడినది. మనోరహితమైనది. పశుపుకు మనసులేదు. కాని, మనసుతోకూడినవాడే మనిషి. 'మనిషి' అనే పేరు మనసునుండి వచ్చినదే! కనుక, యీ ఆత్మతత్త్వములోపల యేకత్వాన్ని మనము గుర్తించాలి. ప్రతీ దేహమునందు యీ ఆత్మ అనేది వుంది. ఈ



srisathyasaivachanamrutam

దేహము ఒక రథము. ఆత్మ దీనికి రథికుడు. కాబట్టి ప్రతి రథమునకు ఒక్కొక్క రథికుడు వుంటున్నాడు. ఇది అందరికి సమానమేకదా! ఒక్కొక్క బండి ఒక్కొక్క రూపంలో వుండవచ్చు. ప్రతిదేహము ఒక రథమువంటిదే! ఈ రథములోపల ఒక డ్రైవరు వుంటున్నాడు. మానవత్వములోపల సమత్వమనేది యేది? రథము, రథికుడు రెండూ సమత్వమే! ఇదే మానవత్వములోని యేకత్వము. కనుక, యీ యేకత్వములో అనేకత్వమును భావించటంకంటే అనేకత్వములోవున్న యేకత్వాన్ని గుర్తించటం, అత్యవసరము. మానవులందరియందు యేకత్వపు గుర్తులు స్పష్టముగా కన్పిస్తూనే వున్నవి. ఒక చక్రవర్తి వుండవచ్చును. అతనికి ఆకలివుంటున్నాది. అతనికి ఆకలి అయితే పంచభక్ష్యపరమాన్నములు భుజించవచ్చును. ఆకలి తీర్చుకోవచ్చును. ఒక భిక్షగాడు వుంటున్నాడు. అతనికి ఆకలి వుంటున్నాది. అతనికి ఆకలి తీరాలంటే అంబలి గంజితో తీర్చుకోవచ్చును. బిక్షగానికి అంబలి గంజి, కోటీశ్వరునికి పంచభక్ష్యపరమాన్నములు. ఈ పదార్థములు వేరుగానీ యిద్దరికి ఆకలి, అది తీరటం సమానమే! ఆకలిదప్పులు అందరికి ఒక్కటే! జననమరణములు అందరికి ఒక్కటే! సుఖదుఃఖములు అందరికి ఒక్కటే! దుఃఖమువస్తే కోటీశ్వరుడు యేడుస్తాడు, కూటిపేద యేడుస్తాడు. ఇది అందరికి యేకత్వముగా వుండినప్పుడు, యిది భిన్నత్వం అని యేరీతిగా మనము వాదించటానికి వీలవుతుంది? లౌకిక జగత్తునందు భోగభాగ్యములలో వ్యత్యాసము వుండవచ్చు. కాని, దైవదృష్టియందు సర్వులుకూడను ఒక్కటే! అన్ని జీవులయందు ఆత్మస్వరూపమైన దైవము వున్నాడు. కనుక, ఆ యేకత్వాన్ని గుర్తించి మానవులందరు ఒక్కటే అనే జీవితతత్త్వాన్ని అర్థం చేసుకోవాలి. ఈనాడు ఈ విధమైన యేకత్వము భిన్నత్వముగా మారిపోవటంచేతనే జగత్తులోపల యీ విధమైన కష్టములధికమవుతూ వస్తున్నాయి. ఈనాడు మన సంస్థలయందు యీ యేకత్వాన్ని మనం అభివృద్ధిపరచాలి. మానవులందరూ ఒకటే! అందరూ దైవముయొక్క అంశములే. అన్ని దేహములయందువుండిన ఆత్మ ఒక్కటే! కనుక, యీ రూపనామములయొక్క వికారమును చూచి మనము యేమాత్రము చలించరాదు. దానిని త్యజించు. దానియందున్న యేకత్వాన్ని వరించు. మనం చేయవలసిన సేవ యీనాడు అదే! దానిని మనం అర్థం చేసుకోకుండా యెన్ని సేవలు చేసినా ప్రయోజనము లేదు.

sri sathyasai vahini amrutam

మనసునిండా మాలిన్యముంచుకొని ధర్మములు, ధర్మములని సేవలాచరించినంతమాత్రమున అది యేమాత్రము ఫలితము నందించలేదు.

**దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న**
**పొంచిచూచు కనులున్న పంచల విను మనసున్న**
**వంచితగుణ చిత్తమున్న వంచించే హృదయమున్న**
**ఈ గుణములు చూడగనే ధర్మము యిక నిలువదన్నా**

అటువంటి హృదయములో ధర్మమనేది యేమాత్రము నిలచటానికి వీలుకాదు. ధర్మం దైవ స్వరూపము. ఆ ధర్మము సమత్వముతో వుంటున్నాది. కష్టములకు కృంగటముగాని, సుఖములకు పొంగటముగాని లేని సమత్వమును మనము యీ సేవలద్వారా సంపాదించుకోవాలి.

**భక్తులకు సహనము, సమత్వము తగిన లక్షణాలు**

ఆనాటి పరమభక్తులైనవారంతా యీ సమత్వాన్ని ఆచరణలో పెట్టుకుంటూ వచ్చారు. చాలామందికి తెలుసు, తుకారాం. అతను పరమ భక్తుడు. అతనికి అర్ధఎకరము భూమి వుండేది. దానిని యేదో పండించుకోటమో, ఎండించుకోటమో జరుపుకొని, పొట్టను నింపుకోటమో లేక కాల్చుకోటమో జరుగుతూవుండేది. అయినప్పటికి, తన కుటుంబముయొక్క ఆహారవిహారములను గురించి ఏ మాత్రము చింతపడకుండా దైవచింతనమాత్రం నిరంతరం సల్పుతుండేవాడు. అతనికి భార్యబిడ్డలు వుంటున్నారు. ఒకప్పుడు అతని భూమిలో మంచి వర్షములు పడటంచేత చెరకు తోట వేసుకున్నాడు. అతని హృదయము త్యాగమయమైనది. అది పంటకు వచ్చేటప్పటికి అటుపోయేవారు 'తాతా! తాతా! ఒక చెరుకు నిస్తావా', అని అడిగేవారు. అడిగిన వారినందరిని కొట్టుకొని తీసుకుపొమ్మనేవాడు. అంత త్యాగం, పాపం! ఈ విధముగా జరుగుతూ జరుగుతూ కడపటికి మూడు భాగములు చెరకంతా యితరులకు దానం చేయటంతో సరిపోయింది. ఏదో అంతో యింతో వారికి పనికిరాని చెరకును నిల్పిపోయారన్నమాట! దానిని కొట్టుకొని బండిలో వేసుకొని యింటికి వస్తున్నాడు. ఆ దారియందు పిల్లలందరు గుంపుగా చేరి

srisathyasaivachanamrutam

నాకొక చెరకుతుండు యివ్వమని అడుగుతూ వచ్చారు. అక్కడకూడా దారిపొడువునా యిచ్చుకుంటూ వచ్చాడు. ఇంటి దగ్గర కొచ్చేటప్పటికి ఒక చిన్న చెరుకుతుంట మిగిలింది. బండి చూచింది. భార్య మండిపడింది. నీకేమి యింటిలో భార్యబిడ్డలు లేరా? వీళ్ల గతి యేమనుకున్నావు? నీ దానాల్తో, ధర్మాలతో నీవు మునిగిపోతుంటే. కట్టుకున్నందుకు నీ కర్తవ్యాన్ని నిర్వర్తించనక్కరలేదా? ఈ విధముగా ప్రశ్నల వర్షము కురిపించింది, ఆ భార్య. అన్నింటికి తుకారాం చిరునవ్వుతో ఉండిపోయాడు. కట్టకడపటికి ఒక్క జవాబు చెప్పాడు, 'ఇదుగో తెచ్చాను, ఒక చెరకు నీకోసం'. అది చేతికి యిచ్చేటప్పటికి ఆమెకు చాలా బాధకల్గింది. కోపముకూడ వచ్చింది. ఆ చెరకుతుండు తీసుకొని తుకారాం కాళ్లపైన కొట్టింది. ఒక చిన్నతుండైపోయి క్రిందపడింది. ఒకతుండు ఆమె చేతిలో నిల్చింది. ఆనందంగా నవ్వాడు యీ తుకారాం. ఇలా తుకారాం నవ్వటానికి కారణమేమిటో తనే చెబుతున్నాడు: 'బండిలో యీ చెరకు తెచ్చినంతసేపూ పిల్లలకు యే భాగము, భార్యకు యే భాగము యివ్వాలని నేను ఆలోచించుకుంటూవచ్చాను. ఇప్పుడు నాకా బాధ తీరిపోయింది. నా భాగము నీచేతిలో నిల్చింది. క్రిందపడిన భాగము పిల్లలకు సరిపోయింది', అన్నాడు. ఎంత సమంగా నీవు పంచినావని ఆనందించాడు. ఈ విధమైన సహనభావముతో సమత్వాన్నే గుర్తిస్తూవచ్చాడు.

మహాభారతంలో ద్రౌపది తత్త్వాన్నికూడను మీరందరు గుర్తించే వుండవచ్చును. చీకటిలో పవళించిన తన పుత్రులను చంపిన అశ్వత్థామను పట్టుకొని వచ్చి నీ కనులయెదురుగా అతనిని శిరచ్ఛేదమును చేస్తానని ప్రతిజ్ఞపట్టాడు, అర్జునుడు. అప్పుడు ద్రౌపది అశ్వత్థామతో 'స్వామీ!

**ఉద్రేకంబున రారు శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు కిం**
**చిద్ద్రోహంబును నీకు జేయరు బలోత్సేకంబుతో జీకటిన్**
**భద్రాకారుల చిన్నపాపల రణప్రౌఢ క్రియాహీనులన్**
**నిద్రాసక్తుల సంహరింప నకటా నీచేతులెట్లాడెనో?**

అంతేకాదు,



srisathyasai vahinimrutam

**పరగన్ మా మగవారలందరు మున్ బాణ ప్రయోగోప సం**
**హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం**
**చిరి పుత్రాకృతినున్న ద్రోణుడవు నీ చిత్తంబులో లేశముం**
**గరుణా సంఘములేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే!**

అని ఈ విధముగా పాపం, అతనిని ప్రార్థిస్తూవుండాది, ద్రౌపది. అర్జునునికి కోపంవచ్చి ఖడ్గమెత్తాడు. అడ్డుపడింది ద్రౌపది. "నాధా! యిది మంచిదికాదు. బిడ్డలు లేకపోవటంచేత నేనెంత బాధపడుతున్నానో, యీ బిడ్డ యిప్పుడు చనిపోయాడంటే అతని తల్లికూడను అంత బాధపడుతుంది కదా! నాకు జరిగినది జరిగిపోయింది. నా దుఃఖము యింక నివారించటానికి వీలుకాదు. ఇది నేను అనుభవించే తీరవలెను. కానీ, అశ్వత్థామను నీవు ఖండించినపుడు అతని తల్లి యెంత బాధపడుతుందో. ఆమె మనసుకూడ నావంటిదే కదా!" అని యీ సమత్వాన్ని ఆమె గుర్తించటానికి ప్రయత్నించింది. మాతృహృదయము అందరిదీ ఒక్కటే! నీ కుమారుని వియోగము నీకెంత బాధనో యింకొక కుమారునియొక్క వియోగముకూడను ఆ తల్లికి సమముగానే వుంటుంది కదా!

## ద్వేషాసూయలు సత్యసాయి సేవా సంస్థకు విరుద్ధమైనవి

అదే విధముగా సేవలో ప్రవేశించేవారంతా ఒకరు మనలను దూషిస్తే మనకెంత కష్టమో అదే విధముగ యితరులను మనము దూషిస్తే వారికి కష్టంకాదా, అనే విషయమును గుర్తించుకోవాలి. మన ఆనందము, మన సుఖము, మన సంతోషము మనకెట్టిదో యితరులయొక్క ఆనందము, సుఖము, సంతోషము వారికట్టిదనే సమత్వాన్ని మొట్టమొదట మనం అర్థం చేసుకోవాలి. ఇలాంటి ఆదర్శవంతమైన మార్గాన్ని అందించిన మహాపురుషులు భారతదేశములో కొల్లలుగా వున్నారు. ఇంక పాశ్చాత్యదేశాలలోకూడను అనేకమందిని మీరు చూసేవుంటారు. సోక్రటీస్ మహా వేదాంతి. అతను యెప్పుడుకూడను యీ యేకత్వమునే తాను చింతిస్తూవుండేవాడు. ఈ యేకత్వమునే చింతనచేసి నిరంతరముకూడను సమత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించేవాడు. కష్టసుఖములు రెండింటిని సమముగా భావించే తత్త్వాన్ని తాను అర్థంచేసుకున్నాడు. ఒకనాడు ముందు

sri sathyasai vacharamrutam

వరండాలో కుర్చీపైన కూర్చొని కండ్లు మూసుకొని యోచిస్తున్నాడు. భోజనంవేళ కావచ్చింది. లోపలినుండి తన గృహలక్ష్మి 'ఏమండి! అన్నం వడ్డించాను, త్వరగా రండి!' అని పిలచింది. వినిపించుకోలేదు. ఇంకా గట్టిగా అరచింది యీమె. దగ్గరకు పోయి పిలచింది. కానీ ఆలోచిస్తున్న వాడు యోచనలోనే వున్నాడు. కంటివెంట ఆనందబాష్పాలు రాలుతున్నాయి. ఈమె మాటలనేమీ గుర్తించటంలేదు. ఇతను నిద్రలో వున్నాడో, తన్మయత్వముతో వున్నాడో, మత్తులో వున్నాడో, ఉన్మత్తంలో వున్నాడో యేమిటో అనుకొని భార్య లోపలికి పోయి ఒక బిందెడు నీళ్లు తెచ్చి నెత్తిపైన పోసింది! లేచాడు, సోక్రటీసు. 'ప్రతిదినము కేవలం వురుములు మాత్రమే వురుముతుండేవి. ఇవాళ కుంభవృష్టి కురిసింది' అన్నాడు. భార్య యీవిధంగా చేసిందని అతనికేమాత్రము ఆవేశంగాని, వుద్రేకంగాని రాలేదు. శాంతముగా యిది ఒక వర్షము అనుకున్నాడు. ఈ విధముగా adjust చేసుకునే భావము మనలో వుండినప్పుడే సమాజములో ఆదర్శవంతమైన సేవలు చేయటానికి మనం అర్హులమౌతాము. ఒకరినొకరు ద్వేషించుకోటము, ఒకరిపైన ఒకరు అసూయాభావములు పెంచుకోటము యిది మన సంస్థలకు విరుద్ధమైనది. అందరు ఒక తల్లిబిడ్డలవలె పెరగాలి. అందరూ ఆత్మస్వరూపులుగా మనము విశ్వసించాలి. అప్పుడే సేవలయందుకూడను వుత్సాహ, ప్రోత్సాహములను మనము అభివృద్ధిగావించుకోవచ్చును.

## నిస్వార్థసేవలో ప్రవేశించాలి

మనకుయెంత ధనము వుండినప్పటికిని, యెంత అధికారిగా వుండినప్పటికిని సేవలయందుమాత్రము అందరూ ఒక్కటిగానే మనం విశ్వసించాలి. ఏమిటి యీ ధనము, ఏమిటి యీ పదవులు, ఏమిటి యీ అధికారములు, ఎంతకాలముంటాయి? ఈ పదవులతో, యీ ధనముతో, యీ అధికారముతో మనము అందుకొనేది యేమాత్రములేదు. రావలసినవి వస్తాయి. పోవలసినవి పోతాయి. కానీ దైవానుగ్రహము ఒక్కటే మనకు పోనిది, రానిది. అనగా 'దైవం వేరు, నేను వేరు' అనే తత్త్వము కాదిక్కడ. దైవాన్నికేవలం ఒక Relationshipగా మనం పెంచుకోటానికి వీలుకాదు. కొంతమంది 'నీవే తల్లివి తండ్రివి, నీవే నాతోడు నీడ, నీవే దైవము నీవే సఖుడవు, నీవే గురుడవు', అని ఆహా

sri sathyasai vachanamrutam

ఎన్నివిధాలుగా వర్ణిస్తుంటారో! ఇది చాలా అజ్ఞానము. ఎందుకీ వర్ణన? 'నీవే తల్లివి, నీవే నాతండ్రివి' అని చెప్పుకున్నంతమాత్రమున అల్పతృప్తేకాని యిది ఆత్మతృప్తికాదు. ఇన్ని చెప్పుటకంటె 'నీవే నేను, నేనే నీవు' అనుకుంటే యెంత సులభముగా అయిపోతుంది! 'అహంబ్రహ్మోస్మి, అహంబ్రహ్మోస్మి', నేనే బ్రహ్మ, నేనే బ్రహ్మ అంటారు. ఇందులోకూడను ఒక విధమైన దోషముంది. బ్రహ్మ బ్రహ్మ అనటానికి 'నేను' అనే పదము పక్కన వుండాలికదా! నేనే బ్రహ్మ. ఆ 'నేను' అనే పదమును అర్థం చేసుకుంటే బ్రహ్మ తానుగానే అయిపోతాడు. ఏదో అర్థంకాని పదములనంతా మనము వుచ్చరించుకుంటూ, అవి ఒక మంత్రాలుగా, తంత్రాలుగా, యంత్రాలుగా భావిస్తూ మన జీవితాన్ని మనము వ్యర్థము గావిస్తున్నాము. అయితే అది మొదటిస్థాయికి అవసరమే! కాని, మనం యెంతకాలం అదే స్థాయిలోవుండరాదు. మానవ జీవితమనేది మూడు క్లాసులుగా విభజించారు. ఒకటి ప్రైమరీక్లాసు, రెండవది హయ్యర్ సెకండరీక్లాసు, మూడవది కాలేజీ లెవల్. అదే విధముగనే మొట్టమొదట మనం కర్మ మార్గంలో ప్రవేశించాలి. తర్వాత ఉపాసన హయ్యర్ సెకండరీ స్కూలులో మనం చేరాలి. అక్కడ ప్యాసైపోతే జ్ఞానమనే కాలేజీలో మనము పూర్తి మన జీవితాన్ని పట్టము కట్టుకోవాలి. చాలామంది మనం యేదో కాలేజీలోనే చదివేసి ఆ పట్టాలనందుకుందామని ప్రయత్నిస్తూవుంటారు. అది చాలా పొరపాటు. ప్రైమరీ స్కూలులో చదవకుండా, హయ్యర్ సెకండరీ స్కూలులో చేరకుండా కాలేజీలో డిగ్రీలు అందుకోటము యేమాత్రము వీలుకాదు. కనుక, మొట్టమొదట మనము కర్మ మార్గములో ప్రవేశించాలి. మానవునికి కర్మయందే అధికారము వుంటున్నాది. కర్మలోనే ధర్మము వుంటుంది. ఆ ధర్మములోనే మర్మము వుంటుంది. ఆ మర్మాన్ని గుర్తించటంకోసమే జన్మము వచ్చింది. ఆ జన్మము ధన్యము చేసుకోవటంకోసమే ఆత్మతత్త్వాన్ని మనము అనుభవించాలి. కనుక, కర్మలో మనము ప్రారంభించాలి. ఆ కర్మ నిష్కామకర్మగా రూపొందాలి. నిస్వార్థమైన సేవలో మనము ప్రవేశించాలి.

**ఈనాడు సమాజదృష్టి గలవారు చాలా తక్కువ**

ఈనాడు active workers అని యిక్కడ ప్రవేశించారు. Active workers అంటే దీనికి

అర్థము యేమిటి? అనగా నిరంతరము పనులలోనే మన జీవితాన్ని గడపటము అని దీనికి అర్థము. అయితే యేం పనిచేస్తున్నాము? తన పని తాను చేసుకుంటున్నాడా లేక సమాజముకోసము చేస్తున్నాడా? కానీ యీనాడు సమాజదృష్టి కలిగినవారు చాలా తక్కువ. స్వార్థబుద్ధితోనే యీ సమాజములో సేవ చేస్తూవుంటారు. మన సంస్థలలో ఆ విధమైన దృష్టి రాకూడదు. నేను, సమాజము రెండూ ఒక్కటే! సొసైటీకి యేమి చేస్తున్నానో అది నాకోసం నేను చేసుకుంటున్నాను. ఆ భావంతో మనము సొసైటీలో సేవచేసినప్పుడే సొసైటీ ఆనందిస్తుంది. మీకును ఆనందము అందిస్తుంది. 'నేను' అనే అహంభావము వదలిపెట్టి అందరూ నావారే అనే యేకభావాన్ని మనం అభివృద్ధిపరచుకోవాలి. అయితే యిది అంత సులభముకాదు. కాని, సులభముకాదని మనం విసర్జించరాదు. సాధ్యమైనంతవరకు ప్రయత్నం చేయండి. ఆ ప్రయత్నంచేత దానిలో సఫలీకృతం కావచ్చును.

## సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం అనే భావముతో సేవ చేయాలి

'సాధనమున పనులు సమకూరు ధరలోన'. నేనెక్కడ, యీ సమాజమెక్కడ, యీ శక్తియెక్కడ, అని నిరుత్సాహానికి యేమాత్రం స్థానం యివ్వరాదు. తలచుకుంటే యేమైనా చేయవచ్చును. కనుక, మానవునియొక్క సంకల్పములో వుండిన శక్తి యిట్టిది. అట్టిదని చెప్పడానికి వీలుకాదు. మనిషి మరణించినాకాని దాని శక్తి జీవించే వుంటుంది. కనుక, ఆదర్శవంతమైన జీవితాన్ని అందించే మానవునిగా మనం రూపొందాలి. ఏకర్మలు ఆచరించినా, భగవత్ ప్రీత్యర్థమనే భావముతో మనము అర్పితము గావించాలి. ఏది చేసినా అది దైవ సేవగానే విశ్వసించాలి. ఆ విధమైన సేవలలో మనం పాల్గొని అలాంటి సేవల నిమిత్తమై మనం జీవించాలి. సేవలలో పాల్గొనటం ఒక గొప్ప అదృష్టమనే భావముతో సేవలు ఆచరించి ఆత్మతత్త్వాన్ని మనం అనుభవించాలి. తనను తాను గుర్తించుకొనే తత్త్వమే సేవయొక్క పరమార్థము. తాను గుర్తించుకున్నాడా సర్వము తానుగానే మారిపోతాడు.

## అన్నమయమైన దేహముతో ప్రారంభించి ఆనందమయమైన ఆత్మలో ప్రవేశించాలి

ప్రేమస్వరూపులారా! ఈనాడు యిట్టి సేవ యెంతైనా అవసరంగా వుంటున్నాది. ప్రపంచమునందు వుండిన అల్లకల్లోలములకు, అశాంతులకు యిది ఒక ప్రశాంతమైన



sri sathyasai vahini / srisathyasaivachanamrutam

వాతావరణాన్ని అందించే అవకాశంగా వుంటుంది. అందరుకూడను అన్నదమ్ములవలె మీరు రండి. తరువాత ఆత్మ స్థాయికి మనం చేరాలి. అన్నమయమైన దేహముతో ప్రారంభమై ఆనందమయమైన ఆత్మలో మనం ప్రవేశించాలి. జీవితము అన్నమయము, అని అన్నమయముతో ఆగిపోరాదు. అన్నమయమునుండి విజ్ఞానమయమునకు ప్రయాణం చేయాలి. ఈ విజ్ఞానమయమునుండి ఆనందమయమునకు ప్రవేశించాలి.

**సేవచేయని మానవుడు మానవుడే కాదు**

ఈ అల్పమైన, తుచ్ఛమైన, క్షణికమైన స్వార్థమును మనము త్యజించాలి. స్వప్రయోజనము అనే దానిని లక్ష్యమునుండి తీసి పారెయ్యాలి. దైవభావాన్నే మన హృదయములో ప్రతిష్ఠించుకోవాలి. త్యాగభావముతో కర్మలో ప్రవేశించాలి. ఇదే యీనాటినుండికూడను ఆచరణలోపెట్టే అవకాశానికి మనం ప్రయత్నించాలి. ఇంకా, యీ సేవయొక్క గమ్యమును ముందు కొంతవరకు రేపో, మరునాడో మనం విచారించుకోవచ్చును. నిజముగా యీ సేవకంటె మించినది మరొకటి యీ జగత్తులో యేమాత్రంకూడను కనుపించదు. కనుక, సేవలోనే మన జీవితాన్ని అంకితం గావించాలి. సేవచేయని మానవుడు మానవుడేకాదు. పశువుకంటే హీనమని చెప్పవచ్చును. కనుక సేవకు మనం దూరం కారాదు. సేవను మనం త్యజించరాదు. సేవలే మన ప్రాణము. సేవలే మన జీవనము. సేవలే మన గమ్యము. ఈ సత్యాన్ని మీరు చక్కగా బలపర్చుకొని జగత్తులో ఆదర్శవంతమైన సేవకులుగా మీరు తయారుకావాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 19-11-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam